# ఆకురాలిన వసంతమై...

చీకటి చిక్కగా ఉన్న రాత్రి....

మెర్క్యూరీ బల్బుకింద అతడు చాలా ఏకాగ్రతతో రోడ్డు మీద బొమ్మ గీస్తున్నాడు. పెరిగిన గడ్డం.... మాసిన గుడ్డలు...రంగురంగుల చాక్‌పీసులు మెర్క్యూరీ లైటు పచ్చదనానికి చిత్రంగా మెరుస్తున్నాయి.

అతడు వీధి చిత్రకారుడు (అలా అనొచ్చా?)

రాత్రంతా రోడ్డు మీద ఒక బొమ్మను గీసి పొద్దంతా నిద్రపోతాడు. లేచేసరికి ఆకలి నకనకలాడితే బొమ్మమీద పడ్డ చిల్లరని గబగబా ఏరుకొని కడుపుని శాంతపరచడానికి కదిలిపోతాడు. రామాయణం, భారతానికి సంబంధించిన అనేక బొమ్మలు అనేకచోట్ల గీసి రెండు అగరొత్తులు బొమ్మ ముందు వెలిగించి పోతే మూడు రూపాయల నించి ఎనిమిది రూపాయల వరకు చిల్లర పడుతుంది. జబ్బకు సంచి, అందులో చాక్‌పీస్‌లు అతడి యావదాస్తి! అందుకే 'జగిత్యాల'లో ఎవడూ అతణ్ణి పట్టించుకోడు.

ఆ రాత్రి తొమ్మిది గంటలకు సినిమాచూసి వస్తోన్న 'సాధన' అతణ్ణి చూసి ఠక్కున ఆగిపోయింది. అతడు సరస్వతి బొమ్మను అదే ఏకాగ్రతతో గీస్తున్నాడు, తన్మయంగా వీణియ తంత్రుల్ని సవరిస్తున్న ఆమె గోళ్ళకు ఎర్రరంగు చాక్‌పీస్‌నద్దుతూ.

అప్పుడప్పుడూ అసహనంగా గడ్డంలో వేళ్ళు పెట్టి కెలుకుతున్నాడు. సరిగ్గా రానిచోట తడిగుడ్డతో తుడిచి మళ్ళీ గీస్తున్నాడు. కరకు

రోడ్డుమీద కాక కాన్వాసు మీదైతే మరింత అందంగా ఉండేది. సాధనకు అతని కళపట్ల ఆరాధన....అతని స్థితిపట్ల జాలి కలిగాయి. రోజూ అదే దారిలో అతణ్ణి చూస్తుంది. కాని అతనెప్పుడూ వంచిన తలెత్తి ఆమెను చూడలేదు.

చిన్నగా దగ్గింది. విన్పించుకునే స్థితిలో అతడు లేడు. బొమ్మ దాదాపు పూర్తవుతుండగా తలెత్తి గడ్డం గోక్కుంటున్న వాడల్లా ఆమెను చూశాడు. సాధన నవ్వింది.

"రోజూ వేస్తున్న బొమ్మల కంటే ఈ బొమ్మ బావుంది" అంది.

"ఒక్కో దేవుడూ ఒక్కో దేశంలో పూజింపబడతాడు. కాని కళ మాత్రం అన్ని దేశాల్లోనూ పూజింపబడుతుంది. అందులోనూ 'సరస్వతి'ని నమ్ముకున్న వాడెవ్వడూ చెడిపోడు. అందుకేనేమో ఈ బొమ్మ బాగా వచ్చింది" అన్నాడు. ఆ మాట కెరటంలా గంభీరంగా సాగి వచ్చింది.

"మీ పేరు...." అడిగింది.

"ఆడాళ్ళు ముందు పేరడిగి తర్వాత సంపాదనడుగుతారు" నవ్వాడు అతను.

"చెప్పకపోతే ఈ బొమ్మ మలిపేస్తాను" అయిదు నిమిషాల పరిచయంలోనే అల్లరిగా అంది.

"మళ్ళీ గీద్దామంటే చాక్‌పీసులు కూడా లేవు. మొన్న గీసిన ఆంజనేయుడి బొమ్మకు ఏ మాత్రం చిల్లరపడలేదు. రేపు పన్నెండు గంటల దాకా ఆకల్ని కూడా అదిమిపట్టాల్సి వుంది" అతడి కంఠ నాళాల్లో ఆకలి తాలూకు ప్రతిధ్వనులు, ఆ బ్లాస్టింగుల వెనుకే చిమ్ముకొచ్చిన నీటి ఊటలా కంటి కొనుకుల్లో నీటి బొట్లు.

హాండ్ బ్యాగ్‌లోంచి చప్పున అయిదు రూపాయల కాగితంతీసి ఆ బొమ్మ మీద ఉంచింది సాధన. "నా అభిమానంతో మీ ఆకలి తీరదు. అయినప్పటికీ"

"థాంక్సండి"

"మీ పేరు?"

అతడు కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పాడు కానీ పేరు చెప్పలేదు. ఆ నోటు తీసుకొని స్తంభం పక్కకెళ్ళి జబ్బ సంచీ తలగడగా ముడుచుకు పడుకున్నాడు. శలభాలు చికాకు పరిచినా....చలి నరాల్లోకి పాకుతున్నా అంపశయ్య మీది భీష్ముడిలా అతడు నిద్రను వెతుక్కుంటూ పోయాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా మిగిలింది.

సాధన తృప్తిగా కదిలింది.

ఈ దేశంలో దరిద్రుడికీ....కళాకారుడికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని అంచనా వేస్తూ.... అతడి గురించి ఆలోచిస్తూ...మనోగుహలో అతడి చిత్రాన్ని గీసుకుంటూ.

ఏడడుగులు నడిపించి విశ్వ కవితా వేదిక మీద అతడి భవిష్యత్ చిత్రపటాన్ని బ్రహ్మాండంగా ఆవిష్కరించి...పచ్చనాకు సాక్షిగా రంగుల వసంతమై వరించి.... అతనిలోని కళాకారునికి నీరాజనం పట్టించాలన్న ఉద్వేగ్నతతో ఆమె నడుస్తుంటే ఠప్పున నెత్తిమీద చినుకు పడింది.

ఆమె ఆలోచనలు అల్లకల్లోలమయ్యాయి. గుండెల మీద గునపం దిగినంత బాధగా తలెత్తి ఆకాశంవైపు చూస్తే అంతా నల్లనల్లగా....

క్షణాల్లో మెరుపు... ఎక్కడో ఉరుము.

ఆ రోడ్డుని కాన్వాసుగా పరచుకొని గీసిన అద్భుత కళాఖండానికి తన నిండారు కొంగుని అడ్డంపట్టి ఆకాశం బారినుంచి కాపాడుదామనుకుందేమో... గబుక్కున వెనుదిరిగింది.

ఆమె నడక వేగంలాగే, జల్లులూ పెరిగాయి.

నిమిషాల్లో వర్షం ఉధృతమైంది. లేడిపిల్లలా పరిగెత్తింది. తడిసిన కుచ్చిళ్ళను పైకెత్తి కొంగుని బొడ్లోదోపి ఆయాసంగా...ఆరాటంగా పరిగెత్తింది. వేగంగా వేస్తున్న అడుగులకు నీళ్ళు చిప్పిల్లి ఆమెను మరింత

తడుపుతున్నాయి. ఆమె వెళ్ళేసరికి రంగు నీళ్ళు ప్రవాహమై కదిలిపోతున్నాయి.

ఆ బల్బు కింద అతడు పూర్తిగా తడిసిపోయి.... గీసిన బొమ్మ మీద నిలిచిపోయిన నీళ్ళను కసిగా బాదుతున్నాడు. రోడ్డును పిడికిళ్ళతో గుద్దుతున్నాడు. ఏడుస్తున్నాడు. తనలో తనే తిట్టుకుంటున్నాడు. రోడ్డు మీద అతడో పిచ్చివాడిలా ఉన్నాడు.

వర్షం హోరున పడుతూనే ఉంది.

సాధన ఆ దృశ్యం చూసి దూరంలోనే ఆగిపోయింది. మెర్క్యురీ బల్బు కింద గాల్లోకి ఎగరేసిన ముత్యాల్లా వర్ష బిందువులు మెరుస్తూ కురుస్తున్నాయి. అయిదు గంటలపాటు నిర్విరామంగా గీసుకున్న బొమ్మ. క్షణాల్లో చెదిరిపోయింది. సాధన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అగాథంలాంటి పట్టణంలో అమ్మనించి తప్పిపోయిన పసిపిల్లాడిలా ఉందతని ప్రవర్తన.

లోతైన పొట్టకు తడిసి అతుక్కుపోయిన లాల్చీ అతడిలోని ఆకల్ని సూచిస్తోంది. కరిగిపోయిన కళాఖండంమీద అతడు నిస్సత్తువగా కూచుంటే.... అతడి తలను ఒళ్ళో పెట్టుకొని ఓదార్చాలనుకుంది సాధన.

అది ప్రేమ కావచ్చు, అభిమానం కావచ్చు.

బాధలోంచి ఎగిసొచ్చిన బలమైన నిర్ణయం.

అతడివైపు నడిచింది. కాని అతడు దురదృష్టవంతుడు. ఆ ఆవేదనని ఆలంబనగా ఆమెతో పంచుకునే అవకాశంకూడా లేకుండా అక్షణమే కరెంటు పోయింది.

ముసుగులో కమ్మేసిన చిమ్మ చీకటి.

చచ్చిపోయిన వేకువ శవమ్మీద నల్లగుడ్డ కప్పిన స్మశానవైరాగ్యపు చీకటి. సాధన బిగుసుకుపోయి నిల్చుంది చీకట్లో. ఎప్పుడో ఒకటి, రెండు వాహనాల లైట్లు తప్ప అంధకారం. పదినిమిషాల తర్వాత కరెంటు

వచ్చినా అతడక్కడ లేడు. స్తంభం కింద తడిసిపోయిన చాక్‌పీసు ముక్కలు... శలభాలు దీపాన్ని ముట్టడిస్తున్నాయి.

చీకట్లో అతడెక్కడికి పోయాడో...?

సాధన వేదనతో ఇంటి ముఖం పడితే ... వర్షం తగ్గు ముఖం పట్టింది.

ఆ రాత్రి సాధనకు నిద్రపట్టలేదు.

* * *

ఉదయం చల్లగా ప్రశాంతంగా ఉంది.

వీక్లీ బజార్‌లో నడుస్తోన్న సాధన కళ్ళు అతనికోసం వెదికాయి. దూరంగా ఓ గుంపు ఉండటంతో అక్కడికి చేరింది. రాత్రి వర్షం వెలిశాక మళ్ళీ కష్టపడి వేసినట్టున్నాడు.

రోడ్డు మీద సరస్వతీ బొమ్మ.

బొమ్మ మీద కొంత చిల్లర.

ఆమె చుట్టుప్రక్కల అతనికోసం చూసింది. కన్పించలేదు. ఆ చిల్లరకు కాపలా లేదు. ఎప్పుడో వచ్చి ఏరుకొని పోతాడు. ఈ లోకాన్ని అతడేమాత్రం పట్టించుకున్నట్టుగా కన్పించడు. చాక్‌పీసులు... బొమ్మలు చిల్లర పైసలు ఇవే అతని నేస్తాలు.

'రాత్రి ఎక్కడికి వెళ్ళారు? —సాధన' అన్న చీటీ రాసి ఆ బొమ్మ మీద పెట్టి దానిమీద చిన్న రాయి ఉంచి వెళ్ళింది సాధన.

తర్వాత అతడు కన్పించలేదు.

సాధన కళ్ళు ఎప్పుడూ అతనికోసం వెతికేవి. రోడ్డు మీద ఎక్కడ బొమ్మ కన్పించినా ప్రతిసారీ చీటీ రాసి పెట్టేది. రోజురోజుకీ సాధనలో మానసికంగా అతడి మీద, బొమ్మలమీద పెరుగుతున్న తృష్ణ, ఆత్మీయత పిచ్చిలేపేది. అయినా అతడు ఎక్కడో కలుస్తాడనే ఆరాటం

ఆరోజు...

నడుస్తున్న సాధనకు ఎదురుగా ఓ వ్యక్తి పరిగెత్తు కొస్తున్నాడు. ఆయాసంగా... రొప్పుతూ నోట్లోంచి రక్తం కారుతూ.... వెనుక పెద్ద గుంపు అతడిమీద రాళ్ళువిసుర్తూ.

కళ్ళను చీకట్లు కమ్మి శోషవచ్చి అతడు రోడ్డు కడ్డంగా పడిపో తుంటే గుర్తించింది సాధన.

అతడే.... చిత్రకారుడు.

పరుగున వెళ్ళి అతణ్ణి పొదివి పట్టుకొని ఒళ్ళో పడుకోపెట్టింది. గుండె శిలను కమ్మేసి ప్రవాహమై పరిగెత్తుకొచ్చిన కన్నీటి కెరటం చెక్కిలి మీద నురగని మిగిల్చింది.

ఆమెకు నోటిమాట రాలేదు.

రాళ్ళతో, కర్రలతో దగ్గరైన గుంపు.... సాధనను చూసి ఆగి పోయింది.

"ఎందుకితన్ని చంపుతున్నారు" సాధన గళంలోని గర్జనకు వెనక్కి తగ్గింది గుంపు.

"వీడు మన దేవుళ్ళని బజారు కీడ్చాడు"

"నడి రోడ్లమీద మన దేవుళ్ళని దించి అవమాన పరుస్తున్నాడు."

"డబ్బుకోసం వీడు దేవుళ్ళను ఎక్కడ పడితే అక్కడ గీస్తు న్నాడు."

"వీడు గీసిన బొమ్మలమీంచి జనం, వాహనాలు పోతున్నాయి. అది మనకు అవమానం... అందుకే వాణ్ని తరిమి కొట్టేది."

అందరి కళ్ళు అరమోడ్పులవుతుంటే... మస్తిష్కంలో వాళ్ళ మాటలు శూలాల్లా దిగుతున్నాయి. సాధన వాళ్ళకి చేతులెత్తి నమస్కరిం చింది.

"విడిచిపెట్టండి. ఇంకెప్పుడూ అతడు రోడ్లమీద బొమ్మలెయ్యడు" ప్రాధేయపడింది. ఆమె అభ్యర్థనకు ఆ గుంపు కరిగి వెనుదిరిగింది.

అతడు నిస్సత్తువగా ఆమె ఒడిలో కదిలాడు. నోటి నుంచి రక్తం ఆగిపోయింది. గుడ్డలు రక్తసిక్తమయ్యాయి. నుదుటిమీద పేరుకొన్న స్వేద బిందువుల్ని కొంగుతో అద్దింది. అతడు కళ్ళు తెరిస్తే.... కళ్ళు వ్యవస్థ పట్ల ఎర్రజీరలు పాకి నీటిని నివురులా కప్పుకున్న ఆ చూపు సాధన గుండెల్ని మెలిపెట్టింది.

"ఇప్పటికీ మీ పేరు చెప్పలేదు"

ఆమె అంతరంగాన అనంత తరంగాల ఘోష. ఆమె దృక్కుల్లో భావం తెలీని భాష. అతడి కళ్ళల్లో ఎవరి మీదో... నిశ్శబ్దంగా పేరుకు పోతున్న కసి... ద్వేషం.... క్రోధం... పెరసి తీగలల్లుకుంటున్న ఎరుపు జీరలు. ఛాతీ బరువుగా ఎగిసిపడుతుంటే వెచ్చటి విశ్వాసలు సాధన ముఖానికి ఆవిరిలా తగుల్తోంది. అతడు మౌనిలా లేచి సాధన చేయిని చుంబించాడు.

సాధన తేరుకోకముందే... చాలా వేగంగా వెళ్ళిపోయాడు అక్క ణ్నించి. పేరు చెప్పలేదు. సాధన పిలుస్తున్నా వెనుదిరగలేదు. ఈ సమాజా నికి దూరంగా ఒంటరితనాన్ని తన చుట్టూ అల్లుకుంటూ పోయిన అనాథలా అగుపించాడు.

చాలా రోజుల దాకా ఆ నగర రోడ్ల మీద మళ్ళీ అతడి గీతలు కన్పించలేదు. అయినా సాధన ఆలోచిస్తోంది. ఆరా తీస్తోంది.

అతడిలో నిక్షిప్తమైన కళను వెలికితీసి ప్రపంచ వేదికమీద ప్రద ర్శించాలన్న కోరిక. కాన్వాసుమీద పెయింట్స్‌తో వేసే స్థాయికి అతడెదగా లన్న ఆశ. మనిషి దూరమైతే మనోచిత్రం దగ్గరవుతుంది. ఆమె మనో ఫలకంమీద అతడు విశ్వరూపమై నిలిచాడు. ఆమె అన్వేషణ ఆఖరి ఘడి యలకు చేరి....

ఆమె నిరీక్షణ దగ్గరైన సమయాన ఓ గుంపు దగ్గరికి చేరిన సాధనకు రోడ్డుమీద అద్భుతమైన చిత్రం.... అర్థమవ్వగా!

ఏ వర్షం కురిసిన రాత్రయితే అతడు సరస్వతీ బొమ్మను గొప్పగా చిత్రించాడో అదే బొమ్మను ఇప్పుడు.... అలాగే కాని... అర్థ మవ్వగా.

నెమలి ఈకల మెత్తదనంమీద ప్రియుడికోసం ఆర్తగీతం పాడుతూ.... వీణా తరంగాల మధ్య ఓలలాడుతున్న గంధర్వ కన్యలా...

సాధన కళ్ళల్లో సన్నటి నీటిపొర.

మనిషి తన ఆలోచనలకనుగుణంగా.... భవిష్యత్‌ను చిత్రీకరించు కోవడంకోసం ఆడదాని అర్ధనగ్నత్వాన్ని మెట్లుగా చేసుకోవడంలో అతడూ మామూలు మనిషేనని.... కళ నిండిన మహర్షి కాదని!

చిల్లరకాదు.... నోట్లు పడుతున్నాయి.

ఏ జనం రోడ్డుమీద దేవుళ్ళని గీస్తే రాళ్ళతో, కర్రలతో కొట్టిందో.... అదే జనం అవే బొమ్మలకు కేవలం అర్ధనగ్నత్వాన్ని పులిమితే అభినందనల్తో.... రూపాయల్తో ముంచుతోంది.

సాధనలో అతనిపట్ల మిగిలిన కళా సారస్వతం మంచులా కరిగి పోయింది.

నిమిషం తర్వాత ఆమె అక్కడలేదు.

"ఒక్కో దేవుడు ఒక్కో దేశంలో పూజింపబడతాడు. కాని కళ మాత్రం అన్ని దేశాల్లోనూ పూజింపబడినా.... అందులో ఇమిడిన ఆడదాని అర్ధనగ్నత్వం అంతటా పూజింపబడదు. కొన్నిచోట్ల ద్వేషింపబడుతుంది. అందుకే I HATE YOU – SADHANA" అన్న అక్షరాలున్న చీటీ ఆ బొమ్మ మీద రెపరెపలాడుతోంది.

★